


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

గురువారం 25 జూన్ 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 2




## ప్రజల రక్షణ కోసమే అత్యాధునిక ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ, సీసీటీవీ కెమెరాల వ్యవస్థ





**-ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలి**

**-జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

భానుపురి /సూర్యాపేట ప్రతినిధి

సూర్యాపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణ పునరుద్ధరణలో భాగంగా జిల్లా కేంద్రంలో బస్టాండ్ చౌరస్తా, ఖమ్మం క్రాస్ రోడ్ చౌరస్తా వద్ద అత్యాధునిక ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థను, ముఖ్యమైన 9 కూడళ్లలో 20 ఆటోమేటిక్ సీసీటీవీ కెమెరాలను బుధవారం ఖమ్మం క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ,సూర్యాపేట మున్సిపాలిటీ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ లో భాగంగా పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే ఖమ్మం చౌరస్తా, బస్టాండ్ చౌరస్తా కూడళ్ల వద్ద అత్యాధునిక సాంకేతికతతో కూడిన సరికొత్త ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు సిసి కెమెరాల వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారని అన్నారు. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అత్యంత శాస్త్రీయంగా నూతన సిగ్నలింగ్ వ్యవస్థను రూపొందించినట్లు తెలిపారు. జంక్షన్ల వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు ఆటోమేటిక్ నంబర్ ప్లేట్లను గుర్తించే ప్రత్యేక సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని, దీని ద్వారా వాహనాల కదలికల పై నిరంతర నిఘా ఉంటుందని అన్నారు. సిగ్నల్ జంపింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, ఇతర ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వాహనదారులను ఈ కెమెరాల ద్వారా సులభంగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ రెండు కూడళ్లలో రికార్డ్ అయ్యే ఫోటోలు, వీడియోలు నేరుగా జిల్లా ఎస్పీ కార్యాలయంలోని ప్రధాన కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించబడి ప్రత్యేక బృందాలు పర్యవేక్షణలో ఉంటాయని. శాస్త్రీయ పద్ధతిలో సిగ్నల్స్ సమయాన్ని కేటాయిం చడం వల్ల వాహనదారులకు ట్రాఫిక్ జామ్ ఇబ్బందులు తొలగి సుఖవంతమైన మరియు సురక్షితమైన ప్రయాణ వీలు కలుగుతుందని అన్నారు. సూర్యాపేట పట్టణాన్ని సాంకేతికంగా మరింత అభివృద్ధి చేస్తూ, ప్రజల రక్షణే ధ్యేయంగా ఈ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని అధికారులకు, జిల్లా వాహనదారులు ఈ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రజల రద్దీ, ప్రజల, వాహనదారుల అవసరాల దృష్ట్యా ప్రజా భద్రతను మెరుగుపరిచే లక్ష్యంతో సరికొత్త ట్రాఫిక్ సిగ్నల్స్, మరియు సీసీటీవీ కెమెరాల వ్యవస్థను ప్రారంభి ంచామని. పట్టణ ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత, సూర్యాపేట డివిజన్ డిఎస్పి ప్రసన్నకుమార్, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, స్థానిక కౌన్సిలర్ శ్రీవిద్య జ్యోతి కరుణాకర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.






## బీపీ, ఒత్తిడి, ఊబకాయం.. గుండెకు ముప్పు

భానుపురి/సూర్యాపేట టౌన్



గుండెపోటు అనేది కేవలం వృద్ధులకు మాత్రమే వచ్చే సమస్య కాదని, ప్రస్తుతం యువతలో కూడా గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రణీత్ పోలమూరి తెలిపారు. అధిక రక్తపోటు (బీపీ), మధుమేహం, కొలెస్ట్రాల్, ధూమపానం వంటి సంప్రదాయ ప్రమాద కారకాలతో పాటు మానసిక ఒత్తిడి, ఊబకాయం, శారీరక శ్రమ లేకపోవడం వంటి ఆధునిక జీవనశైలి కారణాలు కూడా గుండె ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఛాతినొప్పి గుండెపోటు కాకపోయినా, అలాంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. గుండెపోటు, పక్షవాతం వంటి సమస్యలను నివారించాలంటే రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు, కొలెస్ట్రాల్‌ను క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలని సూచించారు.ముఖ్యంగా అధిక రక్తపోటును "సైలెంట్ కిల్లర్"గా అభివర్ణిస్తూ, చాలా మందికి బీపీ ఉన్న విషయం తెలియకపోవడం లేదా చికిత్సను సక్రమంగా కొనసాగించకపోవడం వల్ల గుండెపోటు, పక్షవాతం వంటి ప్రమాదాలు పెరుగుతున్నాయని తెలిపారు.ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, ఒత్తిడి నియంత్రణ, వైద్యుల సూచనల మేరకు చికిత్స తీసుకోవడం ద్వారా గుండె జబ్బులను చాలా వరకు నివారించవచ్చని డాక్టర్ ప్రణీత్ పోలమూరి సూచించారు.

## ఇలాంటి నాయకుడే మాకు కావాలి అంటున్న 9వ వార్డు ప్రజలు

**-ప్రజల గుండెల్లో చోటు సంపాదించిన కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్న**

**-వార్డులో అడుగడుగునా పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం**

భానుపురి/సూర్యాపేట టౌన్



జిల్లా కేంద్రంలోని 9వ వార్డులో బడుగు బలహీన వర్గాల కాలనీ ప్రజల నోళ్లలో ప్రస్తుతం ఒకే పేరు వినిపిస్తోంది. అదే వార్డు కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్న. ప్రజల సమస్యలను కూర్చొని వినడమే కాకుండా, వాటిని వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటూ ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.స్థానికుల కథనం ప్రకారం, గత 25 సంవత్సరాలుగా వార్డుకు ప్రాతినిధ్యం వహించిన పలువురు కౌన్సిలర్లు ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించారని, ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రజల సమస్యలను పట్టించుకున్న సందర్భాలు చాలా అరుదుగా ఉన్నాయని చెబుతున్నారు. కాలనీలో మౌలిక వసతుల కొరత, డ్రైనేజీ సమస్యలు, రోడ్ల దుస్థితి, పారిశుధ్య సమస్యలు వంటి అనేక ఇబ్బందులు ఎదురైనా, గత ప్రజాప్రతినిధులు వాటి పరిష్కారంపై పెద్దగా దృష్టి సారించలేదని వాపోతున్నారు.అయితే ప్రస్తుత కౌన్సిలర్ బండారు మంగమ్మ వెంకన్న మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. వార్డులోని ప్రతి వీధిని సందర్శిస్తూ, ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంటూ, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నారని చెబుతున్నారు. ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకోవడం, వాటి పరిష్కారం వరకు నిరంతరం పర్యవేక్షించడం ఆయన ప్రత్యేకతగా నిలిచిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఎలాంటి హోదా గర్వం లేకుండా సాధారణ వ్యక్తిలా వారితో మమేకమవడం వల్లే ఆయనపై ప్రజల్లో విశేష ఆదరణ పెరిగిందని వార్డు పెద్దలు చెబుతున్నారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి స్పందించడం, అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపించడం వల్ల వార్డులో సానుకూల మార్పులు కనిపిస్తున్నాయని పేర్కొంటున్నారు.మా సమస్య చెప్పడానికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. కౌన్సిలర్ మా వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకుంటున్నారు. చెప్పిన సమస్యను పరిష్కరించే వరకు వెంటపడుతున్నారు. ఇలాంటి ప్రజా నాయకత్వమే మాకు అవసరం అని పలువురు కాలనీ వాసులు అభిప్రాయపడ్డారు.ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న బండారు మంగమ్మ వెంకన్న పనితీరు ఇతర ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలుస్తోందని స్థానికులు కొనియాడుతున్నారు. ప్రజల మధ్య ఉండి, ప్రజలతో కలిసి అభివృద్ధి పథంలో వార్డును ముందుకు తీసుకెళ్తున్న ఆయనకు భవిష్యత్తులో మరింత ప్రజాదరణ లభిస్తుందని వార్డు ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

## రైతుల సంక్షేమమే ధ్యేయం

**-తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్**

ధర్మఘంట యాదాద్రి భువనగిరి జూన్ 24



యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అడ్డగూడూర్ మండలం రేపాక గ్రామ శివారులో గల ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణం కోసం 10మంది రైతులకు ఎకరానికి 12 లక్షలు చొప్పున ఎమ్మెల్యే మందుల సామేలు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి చేతుల మీదుగా రైతులకు బుధవారం చెక్ లను అందజేశారు ఈ సందర్భంగా ఏమ్మెల్యే మందుల సామెల్ మాట్లడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూసేకరణ చేసే అధికారం ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, రైతుల ప్రయోజనాలను కాపాడటమే తమ ముఖ్య ఉద్దేశమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ స్పష్టం చేశారు. డి రేపాక గ్రామ రైతుల భూములకు సంబంధించిన పరిహారం విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో నిర్ణయించిన రేటు ప్రకారం ఎకరాకు కేవలం రూ. 6 లక్షలు మాత్రమే ఇచ్చే అవకాశం ఉండేదన్నారు. అయితే, దశాబ్దాలుగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న రైతుల పరిస్థితిని వివరించడానికి తాను స్వయంగా జిల్లా కలెక్టర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యానని పేర్కొన్నారు. రైతుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని, నిర్ణయించిన రూ. 6 లక్షలకు తోడుగా మరో రూ. 6 లక్షలు కలిపి అందించాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇందుకు అంగీకరించిన కలెక్టర్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతులతో పబ్లిక్ హియరింగ్ నిర్వహించి, ఈ ప్రక్రియను వేగవంతం చేసినందుకు స్థానిక ఆర్డీఓకు, అలాగే ఇందుకు పూర్తిగా సహకరించిన మోత్కూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డికి, సర్పంచ్‌కు, గ్రామ రైతులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, తహసీల్దార్ ఎ. శేషగిరి రావు, డిప్యూటీ తహసీల్దార్ నరసింహ రావు, నగేష్ కుమార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్, మాదవి GPO రేపాక పాల్గొన్నారు.

## సాగర్ లో భక్తి శ్రద్ధలతో ఘనంగా పీర్ల పండగ

భానుపురి/నాగార్జునసాగర్ టౌన్ :

ప్రపంచక పర్యటన కేంద్రం నాగార్జునసాగర్ హిల్ కాలనీ, పైలాన్ కాలనీ లలో ధూంధాంగా జరుపుకునే అతి పెద్ద పండుగ పీర్ల పండుగ, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పీర్ల పండుగను హిందూ, ముస్లింలు సోదర భావంతో అత్యంత వైభవంగా జరుపుకుంటారు. ఇంత వైభవంగా నిర్వహించే ఈ పండుగను చూడడానికి చుట్టు పక్కల గ్రామస్తులే కాకుండా బంధువులు కూడా అధిక సంఖ్యలో వస్తుంటారు. వారం రోజుల పాటు పండుగ వాతావరణం నెలకొని ఉంటుంది. పీర్ల కొట్టంలో ప్రతిష్టించిన పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మొక్కులు తీర్చుకుంటారు. రాత్రివేళ డప్పుల దరువులు, జానపద గేయాల పాటల పాడుతూ, అలువా ఆటలు ఆడుతారు. అంతేకాకుండా పీర్ల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.మొహర్రం మాసంలో పుణ్యం కలుగాలని కోరుకుంటూ కొంతమంది పది రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపడతారు. ఈ పండుగను ప్రతి ఏటా కులాలకు మతాలకతీతంగా ముస్లిం సోదరులతో పాటు జానయ్య కుటుంబ సభ్యులు కృష్ణయ్య, చిన్నయ్య, భూష రాజుల కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, జంగయ్య, సాయిలు, ఆశప్ప, శీను, నరేందర్, సతీష్, జగన్, సంతోష్ నవీన్, కుమార్, శివ, జగదీష్, బాలేశ్వర్ తదితరులు ఘనంగా నిర్వహిస్తారు.

# ఘనంగా శ్రీ సంతోషిమాత బ్రహ్మోత్సవం

















భానుపురి/సూర్యాపేట కల్చరల్

సూర్యాజిల్లా కేంద్రంలో శ్రీ సంతోషిమాత దేవాలయం ప్రతిష్టించి 31 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుదవారం దేవాలయంలో బ్రహ్మోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకులు ఇరువంటి శివ రామ కృష్ణ శర్మ, పరిమి శివరామ జగన్నాథ శర్మ, అశోక్ మిశ్రా లు శ్రీ సంతోషిమాత, శ్రీ సత్య సాంబశివుడు, శ్రీ లక్ష్మీ గణపతి, క్షేత్రపాలక ఆంజనేయస్వామి, సంతాన నాగదేవత ,మానస దేవి మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు అలంకరణలు నిర్వహించారు. పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలతో సామూహికంగా కుంకుమార్చన పుష్పార్చన, గాజుల పూజ, పసుపు కొమ్ముల పూజలు నిర్వహించారు. అనంతరం రుద్ర, లలిత, గణపతి హటరీమాన్ని నిర్వహించి మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీ సంతోషిమాత అమ్మవారికి త్రిభువన మహా సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించి భక్తులందరికీ అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంతోషిమాత దేవాలయగౌరవ అధ్యక్షులు నూక వెంకటేశం గుప్త అధ్యక్షులు బ్రాహ్మ0డ్లపల్లి మురళీధర్ కోశాధికారి కొత్త మల్లికార్జున్ ఉపాధ్యక్షులు పబ్బా ప్రకాశరావు, సోమ శ్రీశైలం, దేవరశెట్టి సోమయ్య, మహంకాళి ఉపేందర్, నూక ముత్యాలమ్మ , బ్రాహ్మ0డ్లపల్లి నాగమణి, మహంకాళి కవిత, బచ్చు నీరజ, ఓరుగంటి కనకరత్నం, వందనపు వెంకటేశ్వర్లు , లక్ష్మారెడ్డి,దేవాలయం మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.